కౌంట్‌డౌన్ షురూ


ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయం

- పది రోజుల్లో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం
- మాజీలు కాబోతున్న ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు
- జీపీల్లాగే ప్రత్యేకాధికారుల పాలన
- ఇబ్రహీంపట్నం మండల ప్రత్యేకాధికారిగా నవీన్‌రెడ్డి!

ఇబ్రహీంపట్నం: మరో పది రోజుల్లో మండల పరిషత్ పాలకవర్గం పదవీ కాలం ముగియనుంది. వచ్చేనెల 4వ తేదీతో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు మాజీలుగా మారనున్నారు. అయితే రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో మండల పరిషత్‌లు.. ఇకనుంచి ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లను న్నాయి. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 14 మంది ఎంపీటీసీలుండగా అందులో పోచారం ఎంపీటీసీ కృపేశ్ మండల పరిషత్ అధ్యక్షుడిగా, భూపతిగాళ్ల మహిపాల్ జెడ్పీటీసీగా ఐదేళ్లుగా కొనసాగుతున్నారు. అయితే జూలై 4న వీరందరి పదవీకాలం ముగియనుంది.

మండల ప్రత్యేకాధికారిగా ఆయనేనా..?

ఇబ్రహీంపట్నం మండల ప్రత్యేకాధికారిగా నవీన్‌రెడ్డిని నియమించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్నారు. మండల పరిషత్ అధ్యక్షుల పదవీకాలం ముగియగానే ఇబ్రహీంపట్నం మండలానికి ప్రత్యేకాధికారిగా నవీన్‌రెడ్డి రాబోతున్నట్లు అధికార వర్గాల్లో టాక్.

'ప్రత్యేక' పాలనలో జీపీలు..

ఈ యేడాది ఫిబ్రవరి 2న సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించిన సంగతి తెలిసిందే. గత ఐదు నెలలుగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పరిపాలన కొనసాగుతోంది. అలాగే మరో పదిరోజుల్లో మండలానికి ఒక ప్రత్యేకాధికారి రాబోతున్నారు. ఇప్పటికే సర్పంచ్‌లు మాజీలు కావడం, త్వరలో ఎంపీటీసీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాలు, మండలాలు పూర్తిగా అధికారుల పరిపాలనలోకి వెళ్లనున్నాయి. మళ్లీ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగేంతవరకు గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులే కృషిచేయాల్సిన బాధ్యత ఉంటుంది.

ఎన్నికలు నిర్వహించాలి



పదవీకాలం ముగిసిన గ్రామ పంచాయతీలకు, ముగియనున్న మండల ప్రజా పరిషత్‌లకు ప్రభుత్వం వెంటనే ఎన్నికలను నిర్వహించాలి. కప్పపహాడ్ ఎంపీటీసీగా ఐదేండ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాను. రూ.4.76 కోట్లతో తుర్కగూడ నుంచి కొంగరకలాన్ వయా పోచారం వరకు బీటీ రోడ్డును నిర్మించాం. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలి.

– భరత్‌రెడ్డి, ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు


ప్రొసీడింగ్ అందజేస్తున్న నిత్యారెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోడకొండ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఆదివారం ఆమె రూ.5లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ అందజేశారు. ప్రభుత్వ సహకారంతో ప్రతి గ్రామంలో జెడ్పీటీసీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లచ్చిరాం నాయక్, చిన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


చిన్నారులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సరైన వైద్య సేవలు అందకపోవడంతో రోగాలబారిన పడుతున్నారని, వారి తల్లిదండ్రులకు రోగాల నివారణ చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేసినట్లు హయత్‌నగర్ కేబీకే కలర్స్ చిల్డ్రన్ ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. కాగా వైద్య శిబిరంలో 159 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డా.వాసు, డా.నరేష్‌కుమార్ డా.విలియం, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి

పెద్దఅంబర్‌పేట అధ్యక్షుడు జైపాల్ రెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ సర్కార్ రైతుల పక్షపాతి అనే విషయం సీఎం రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ ప్రకటనతో మరోసారి రుజువైందని పెద్ద పెద్దఅంబర్‌పేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు రుణమాఫీపై ప్రకటనను హర్షిస్తూ పెద్ద అంబర్‌పేట కూడలిలో కాంగ్రె పార్టీ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఐసీసీ సభ్యులు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బుయ్య కృష్ణగౌడ్, మాజీ సర్పంచ్ పెంటయ్య, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులువిజయేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండోబా ఆలయ సందర్శన


కండోబా ఆలయం వద్ద నాయకులు

ఆమనగల్లు: మహారాష్ట్రలోని పూణె జిల్లాలో ఉన్న కండోబా మల్లన్న దేవాలయాన్ని ఆదివారం ఆమనగల్లు మండలానికి చెందిన పలువురు నాయకులు సందర్శించారు. మాజీ వైస్ ఎంపీపీ నిట్టె నారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు మంగమ్మ, నాయకులు రాములయ్య, కృష్ణయ్య, అంజయ్య తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుకున్నట్లు ఎంపీటీసీ మంగమ్మ వివరించారు.

నేడు కాంగ్రెస్ సంబురాలు

ఆమనగల్లు: రైతు రుణమాఫీ ప్రకటనపై హర్షిస్తూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో సోమవారం సంబురాలు నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో).. టమాట 59, వంకాయ 35, బెండ 45, పచ్చి మిర్చి 70, కాకర 55, బీర 45, క్యాబేజీ 28, ఫ్రెంచి బీన్స్ 105, క్యారెట్ 40, దొండ 26–35, ఆలు 35, దోస 23, చామగడ్డ 37. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నిరుపేదలకు అండగా ఉంటాం


యజ్ఞంలో పాల్గొన్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: నిరుపేదలకు ఐక్యతా ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లిలో ఉన్న హనుమాన్ దేవాలయాన్ని ఆదివారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ.2 లక్షల విరాళం అందించారు. అనంతరం ఆమనగల్లు మండలం గౌరారంలో రైతు నిట్టె పర్వతాలు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఇటీవల పిడుగుపాటుతో పర్వతాలుకు చెందిన 2 పాడి ఆవులు మృతిచెందాయి. ఈ నేపథ్యంలో బాధిత రైతు పర్వతాలుకు తక్షణ సాయంగా రూ.25 వేలను సుంకిరెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాములు, కౌన్సిలర్ రాములు నాయక్, నాయకులు రచ్చ శ్రీరాములు, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, అష్రఫ్, సాజిద్, రామస్వామి, రమేశ్, కిరణ్‌కుమార్, వెంకటయ్య, వినోద్, అభినవ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, జగదీశ్వరాచారి, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘు తదితరులు ఉన్నారు.

డొనేషన్ల పేరుతో దోపిడీ

- ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి
- బీజేవైఎం నేత శశిధర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో డొనేషన్ల పేరుతో విచ్చలవిడి దోపిడీకి పాల్పడుతున్నారని.. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ఐటీసెల్ జిల్లా కన్వీనర్ కంబాలపల్లి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో డొనేషన్ల పేరుతో అక్రమంగా ఫీజులను వసూలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పిల్లల భవిష్యత్ కోసం కొంతమంది తల్లిదండ్రులు ఆస్తులు అమ్మకొని డొనేషన్లను చెల్లిస్తున్నారని, మరికొంత మంది డొనేషన్లు చెల్లించలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరిని అవలంభిస్తోందని ఆరోపించారు. డొనేషన్ల పేరుతో అక్రమ దోపిడీలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

చినుకు పడితే చిత్తడే

- వర్షంతో బురదమయంగా కుమ్మరికుంట కట్ట
- బీటీ రోడ్డు వేయాలని స్థానికుల వినతి


హయత్‌నగర్ కుమ్మరికుంట రోడ్డు దుస్థితి

హయత్‌నగర్ : అది హయత్‌నగర్–సాహెబ్‌నగర్‌కు లింకు రోడ్డు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే రహదారి. పదుల సంఖ్యలో కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు. కానీ చినుకు పడితే రోడ్డంతా చిత్తడే. అదే కుమ్మరికుంట కట్టపై నుంచి వెళ్లే రోడ్డు. హయత్‌నగర్ కుమ్మరికుంటపై నుంచి వెళ్లే రోడ్డు మట్టితో ఉంది. ఏమాత్రం వర్షం వచ్చినా రోడ్డంతా బురదమయంగా మారుతుంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు జారీ పడుతున్నారు. రోడ్డును వెడల్పు చేసి బీటీ వేయాలని కొన్నేళ్లుగా స్థానికులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కట్టను పటిష్టం చేసే క్రమంలో పనులు చేపట్టినా పనులు చేయడంలో జాప్యం కారణంగా పరిస్థితి మారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుమ్మరికుంటపై రోడ్డును వెడల్పు చేసి బీటీ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని లక్ష్మారెడ్డిపాలెంలో గల యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వార్డ్ అండ్ డీడ్ క్యాంపస్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగే ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్, దంత, నేత్ర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన రాములమ్మ(63) అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు.. శ్రీకాంత్, శ్రీను, యాదయ్య, రాములు, ఎల్లయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ


తుర్కయంజాల్: శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు


యాచారం: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తుర్కయంజాల్: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని తుర్కయంజాల్‌లో ఆ పార్టీ శ్రేణుల ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి రమేష్, రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, కౌన్సిలర్ శ్రీలత అనిల్, నాయకులు.. శ్రావణ్ కుమార్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, మైలారం బాబు పాల్గొన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ కృషి ఫలితంగానే నేడు దేశంలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించిందని అన్నారు. బీజేపీ నాయకులు జంగయ్యగౌడ్, రమేష్, సత్తయ్య, విజయ్‌నాయక్, బీరప్ప, నరేందర్‌గౌడ్, ఐలేష్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో దివంగత శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు భాషయ్య, మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శులు రాజు, రాజేంధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించండి


సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా.. నిర్మాణం పూర్తయిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని సంబంధిత అధికారులను జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో అద్దెభవనంలో కొనసాగుతున్న కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు పడుతున్న కష్టాలను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలలకు సొంత భవన నిర్మాణానికి కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై పదిహేను రోజులు కావస్తున్నా.. నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనాన్ని ప్రారంభించడానికి జాప్యం ఎందుకు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడిచినా విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఒకవేళ పాఠశాల ప్రారంభానికి ప్రొటోకాల్ ఇబ్బందిగా మారితే జెడ్పీటీసీ పదవిని వదులుకోడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. పాఠశాల ప్రారంభం కాలేదని, సీట్లు లేవని విద్యార్థులకు సాకులు చెప్పి ఆమనగల్లు, కందుకూర్ మండలాలకు పంపిస్తున్నారని జెడ్పీటీసీ ఆరోపించారు. పాఠశాల నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించకపోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాం, భూనాథ్, నర్సింహగౌడ్, జంగయ్య, సాయిలు, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు.. నర్సింహ, రాంచంద్రయ్య, శ్రీను, కృష్ణ,గోపాల్, అంజి, శ్రీకాంత్, జైపాల్, గణేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు అభివృద్ధికి నిధులు మంజూరు


అనురాధకు నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న అనితారెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టడానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.16 లక్షలు మంజూరైనట్లు ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ తెలిపారు. హైదరాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంలో ఆదివారం ఆమనగల్లు మండలానికి నిధులు మంజూరు చేస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ అనితారెడ్డి ఉత్తర్వులు అందించారని ఆమె వివరించారు. మండల పరిధిలోని సీతారాంనగర్ తండా గ్రామ పరిధిలోని పులిగోనిపల్లి తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, మేడిగడ్డతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, రాంనుంతల గ్రామ పరిధిలోని పెద్దతాండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు, శంకరకొండ తండా గ్రామ పరిధిలోని కేశ్య తండాలో రోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరైనట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: రోడ్డు పక్కనే ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు కోరారు. ముచ్చర్లకుంట తండా రోడ్డుపై ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ముచ్చర్లకుంట తండాకు వేసే బీటీ రోడ్డు నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరారు. ఈ విషయంపై త్వరలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగయ్య గౌడ్, కంభాలపల్లి బుగ్గరాములు, రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

ఎల్బీనగర్ : సమస్యలు పరిష్కరించాలని బీఎన్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపాపిరెడ్డి కాలనీ వాసులు ఆదివారం రోడ్లపై నిలిచిన నీటిగుంట వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ, సమస్యల పరిష్కారంలో చూపడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమమంలో బాలునాయక్, సోమయ్య, సుదర్శన్‌రెడ్డి, రాఘవేందర్, వెంకటేశ్వర్, ఉదయ్‌శ్రీ, ఉమాపతి, సాంబయ్య, దేవాదాసు, బ్రహ్మాచారి, రామకృష్ణ, రమణ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు


మొక్క నాటుతున్న మాధవాచారి

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశం కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాధవాచారి, సీనియర్ నాయకులు పాపయ్య గౌడ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్, దేశ్యా నాయక్, యాదయ్య, చెన్నారెడ్డి పాల్గొన్నారు.